జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 19 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 6

# జపాన్‌లో ఆధునిక వ్యవసాయ విధానాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యయనం



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి) :** కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ జపాన్ పర్యటనలో భాగంగా అక్కడి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి ఆధునిక వ్యవసాయ విధానాలు, సాగులో వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంటల సాగు నుంచి నిర్వహణ వరకు వివిధ దశల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్న విధానం, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు అనుసరిస్తున్న పద్ధతులపై అవగాహన పొందారు. జపాన్‌లో వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న వినూత్న విధానాలు, యాంత్రీకరణ,

మిగతా 2 లో...

- ఒకచోట ప్రభుత్వ ప్రతిపాదనలు.. మరోచోట ఇసుక నిల్వలు!
- 1.87 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకపై అంతుచిక్కని వ్యవహారం..
- గిరిజన సొసైటీకి దక్కే లాభాలెంత? తెరవెనుక వ్యాపారం చేసేదెవరు?
- పంచాయతీ తీర్మానం నుంచి ఇసుక తరలింపు వరకు అధికారుల పర్యవేక్షణ ఏది?



# సింగిరెడ్డిపల్లి పేరుతో ఇసుక పూడికతీత.. భూపతిరావుపేటలో డంపింగ్ దందా!

**పినపాక,నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** గోదావరి నదిలో ఇసుక పూడికతీత పేరుతో సాగుతున్న వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకవైపు సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో భారీ మొత్తంలో ఇసుక పూడికతీతకు ప్రభుత్వ సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. మరోవైపు భూపతిరావుపేట ప్రాంతంలో ఇసుక డంపింగ్ జరుగుతోందన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సింగిరెడ్డిపల్లి పేరుతో అనుమతులు, భూపతిరావుపేట వద్ద ఇసుక నిల్వలు, జానంపేట మీదుగా రవాణా జరుగుతోందన్న అనుమానాలు ఇప్పుడు పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అసలు పూడికతీత ఎక్కడ? ఇసుక నిల్వలు ఎక్కడ? తరలింపునకు అనుమతులు ఎవరిచ్చారు? గిరిజన సొసైటీకి దక్కాల్సిన ప్రయోజనాలు ఎవరికి చేరుతున్నాయి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**1.87 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకకు ప్రతిపాదన!**

తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (TGMDC) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రాజెక్ట్ అధికారి జి. శంకర్ 26-05-2026న సింగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శికి పంపిన లేఖలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు గోదావరి నది ముంపు ప్రాంతంలో 93,750 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 1,87,500 క్యూబిక్ మీటర్ల ఇసుక పూడికతీతకు సంబంధించిన ప్రతిపాదనను ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో జిల్లా కలెక్టర్, డీఎల్ఎస్సీకి సంబంధించిన గత ఉత్తర్వులను కూడా ప్రస్తావించారు. ఇంత భారీ మొత్తంలో

మిగతా 2 లో...

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేయాలి



- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ఈనెల 19న సిద్దిపేట నుంచి పథకాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి)** ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పథకం ప్రారంభోత్సవం, దరఖాస్తుల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19న సిద్దిపేట నుంచి పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు నిర్వహించాలని సూచించారు. రాబోయే రెండు వారాల పాటు గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని ఆదేశించారు. బీమా పొందే వ్యక్తి, నామినీ వివరాలను

మిగతా 2 లో...

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి


- డీఆర్వో పద్మావతి
- మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి
- జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీ సమావేశంలో డీ.ఆర్.ఓ పద్మావతి



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18,(ప్రజాజ్యోతి)** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను

మిగతా 2 లో...

# 25 ఏళ్లకే నూరేళ్ల నిండని జీవితం.. యువకుడి మృతి!



**సుజాతనగర్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** ఆకుటుంబంలో ఎన్నో ఆశలు.. భవిష్యత్తుపై ఎన్నో కలలు.. కుటుంబానికి అండగా నిలుస్తూ భార్యాబిడ్డలను సంతోషంగా చూసుకోవాలన్న ఆశయం. కానీ విధి మరోలా తలచింది. కేవలం 25 ఏళ్ల వయసులోనే అనారోగ్యం రూపంలో మృత్యువు కబళించడంతో ఓ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. ఏడాది వయసున్న చిన్నారికి తండ్రిని దూరం చేసి, భార్యను ఒంటరిని చేసి, తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిన ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రూప్లా తండాలో తీవ్ర విషాదాన్ని నింపింది. రూప్లా తండాకు చెందిన భూక్య కోటేశ్వరరావు కుమారుడు భూక్య సంతోష్ (25) వృత్తిరీత్యా కారు డ్రైవర్‌గా కొత్తగూడెంలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్యతో పాటు ఏడాది వయసున్న చిన్నారి కుమార్తె ఉంది. అయితే గత కొన్ని రోజులుగా కడుపు నొప్పి, జ్వరంతో బాధపడుతున్న సంతోష్ తొలుత కొత్తగూడెంలోని స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందాడు. పరిస్థితిని పరిశీలించిన ఆర్ఎంపీ ఆసుపత్రిలో చేరాలని సూచించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని పల్స్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడి నుంచి

మిగతా 2 లో...

## జపాన్‌లో ఆధునిక వ్యవసాయ విధానాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యయనం



(మొదటి పేజీ తరువాయి...)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకుంటున్న తీరు, పరిమిత వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూ అధిక దిగుబడులు సాధిస్తున్న విధానాలను కలెక్టర్ అధ్యయనం చేశారు. ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ, సాగు ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమయం, శ్రమ ఆదా చేస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్న విధానాలను పరిశీలించారు. జపాన్ పర్యటనలో గుర్తించిన ఉత్తమ వ్యవసాయ విధానాలను కొత్తగూడెం జిల్లాలోని వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, స్థానిక పంటల సాగు తీరు, రైతుల అవసరాలకు అనుగుణంగా అన్వయించే అవకాశాలను పరిశీలించనున్నారు. తద్వారా జిల్లాలో వ్యవసాయ రంగానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు, రైతులకు ప్రయోజనం చేకూర్చే వినూత్న సాగు విధానాలను ప్రోత్సహించేందుకు ఈ అధ్యయనం దోహదపడనుంది.

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని విజయవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

తప్పులు లేకుండా నమోదు చేయాలని, ఏ కుటుంబం పథకం ప్రయోజనాలకు దూరం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాతో పాటు మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాల ద్వారా పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రారంభోత్సవాలు, ప్రత్యేక శిబిరాలు, దరఖాస్తుల సేకరణను విజయవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 25 ఏళ్లకే నూరేళ్ల నిండని జీవితం.. యువకుడి మృతి!

(మొదటి పేజీ తరువాయి...)

మెరుగైన వైద్యం కోసం రైన్‌బో ఆసుపత్రికి తరలించగా, వైద్య పరీక్షలు, స్కానింగ్‌లో పేగు ఉబ్బినట్లు గుర్తించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు చికిత్సలో భాగంగా ఉబ్బిన పేగు సమస్యను సరిచేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆశించిన ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. కిమ్స్ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించగా, పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యుల్లో ఆశలు చిగురించాయి. తమ తమ్ముడు కోలుకుని తిరిగి ఇంటికి వస్తాడని, మళ్లీ కుటుంబంతో కలిసి సంతోషంగా జీవిస్తాడని బంధువులు ఆశగా ఎదురుచూశారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం సుమారు 12 నుంచి 1 గంటల మధ్య సంతోష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

### ఏడాది పాపకు తీరని లోటు.. భార్య కన్నీరుమున్నీరు

కళ్లముందే భర్తను కోల్పోయిన భార్య రోదనలు కుటుంబ సభ్యులను కలచివేశాయి. ఏడాది వయసున్న పాపకు తండ్రి దూరం కావడంతో గ్రామస్తులు సైతం కన్నీటి పర్యంతమవుతున్నారు. కుటుంబానికి ఆసరాగా నిలిచిన యువకుడు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అసలు ఇంతటి విషాదం ఎలా జరిగిందంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్వగ్రామానికి మృతదేహం తరలింపు

హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి నుంచి బుధవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన రూప్లా తండాకు తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంతోష్ మృతితో రూప్లా తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న వయసులోనే కుటుంబాన్ని, భార్యాబిడ్డలను వదిలి వెళ్లిపోవడంతో గ్రామంలో ప్రతి ఒక్కరూ తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

## సింగిరెడ్డిపల్లి పేరుతో ఇసుక పూడికతీత..

# భూపతిరావుపేటలో డంపింగ్ దందా!

(మొదటి పేజీ తరువాయి...)

ఇసుక పూడికతీతకు సంబంధించిన వ్యవహారంలో గ్రామపంచాయతీ తీర్మానం కీలకంగా మారింది. TGMDCకి అనుకూలంగా తీర్మానం పంపించాలని ప్రాజెక్ట్ అధికారి గ్రామ పంచాయతీ కార్యదర్శిని కోరినట్లు పత్రంలో స్పష్టంగా ఉంది.

### గిరిజన సొసైటీ పేరు.. రూ.146 ప్రస్తావన!

ఈ పూడికతీత వ్యవహారంలో శ్రీ సమ్మక్క సారక్క మహిళా గిరిజన ఇసుక క్వారీ కార్మికుల సహకార సంఘం పేరును అధికారులు ప్రస్తావించారు. మద్దులగూడెం కేంద్రంగా నమోదైన ఈ సొసైటీకి సంబంధించిన వివరాలను జిల్లా సహకార అధికారి సమర్పించినట్లు లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.146 చొప్పున లాభాల పంపిణీకి సంబంధించిన ప్రస్తావన కూడా ఉంది. గిరిజనుల మధ్య లాభాలను సమానంగా పంపిణీ చేయాలని లేఖలో కోరారు. అయితే ఇక్కడే అసలు ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఈ రూ.146 ఏ ప్రాతిపదికన నిర్ణయించారు? మొత్తం 1,87,500 క్యూబిక్ మీటర్లకు వర్తిస్తుందా? సొసైటీ సభ్యులకు ఎంత మొత్తం అందుతుంది? ఇప్పటివరకు ఎంత చెల్లించారు? లాభాల పంపిణీకి సంబంధించిన పూర్తి ఒప్పందం ఏమిటి? అనే అంశాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

### ఒకచోట పూడికతీత.. మరోచోట ఇసుక డంపింగ్?

సింగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో పూడికతీతకు సంబంధించి అధికారిక పత్రాలు ఉండగా.. భూపతిరావుపేట ప్రాంతంలో భారీగా ఇసుక నిల్వలు ఉన్నాయన్న ఆరోపణలు మరో కోణాన్ని తెరపైకి తెస్తున్నాయి. ఇసుక రవాణాకు సంబంధించి జానంపేట మార్గం కూడా చర్చకు వస్తోంది. అయితే సింగిరెడ్డిపల్లి పూడికతీతకు సంబంధించిన ఇసుకే భూపతిరావుపేటలో నిల్వ చేస్తున్నారా? అక్కడి నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు ఉన్నాయా? రవాణా చేసిన వాహనాల వివరాలు ఏమిటి? రవాణా పర్మిట్లు, ట్రాన్సిట్ పాసులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. పూడికతీత ప్రాంతం ఒకచోట ఉండి, ఇసుక నిల్వలు మరోచోట కనిపిస్తే వాటి మధ్య సంబంధాన్ని అధికారిక రికార్డులతో నిర్ధారించాల్సి ఉంటుంది. అనుమతించిన పరిమాణానికి మించి ఇసుక తరలింపు జరిగిందా? అనుమతించిన ప్రాంతం వెలుపల నిల్వలు ఏర్పాటు చేశారా? అన్నది కూడా తేలాల్సి ఉంది.

### PESA చట్టం పేరుతో గిరిజనులకు నిజంగా ప్రయోజనమా?

TGMDC లేఖలో PESA Rules, 2011లోని రూల్ 7ను ప్రస్తావించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో చిన్న తరహా ఖనిజాల వినియోగానికి స్థానిక గిరిజనులకు, పూర్తిగా స్థానిక ఎస్టీ సభ్యులతో ఏర్పడిన సొసైటీలకు సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నిర్ణయం అంతిమమైనదని కూడా లేఖలో ప్రస్తావించారు. అయితే ఈ నిబంధనల ప్రకారం గ్రామసభ, గ్రామపంచాయతీకి ఉన్న అధికారాలు, సొసైటీకి పని అప్పగించే విధానం, లాభాల పంపిణీ వంటి అంశాలను అధికారులు బహిర్గతం చేయాల్సి ఉంది. గిరిజనుల పేరుతో సొసైటీ ఏర్పాటు చేసి, అసలు వ్యాపార ప్రయోజనాలు మరెవరికైనా చేరుతున్నాయా? సొసైటీ సభ్యులే ఇసుక పూడికతీత, రవాణా, విక్రయ వ్యవహారాల్లో భాగస్వాములుగా ఉన్నారా? లేక కేవలం కూలీ పనులకే పరిమితమవుతున్నారా? అన్నది విచారణతో తేలాల్సిన విషయం.

### పంచాయతీ తీర్మానం ఉందా? అనుమతుల సంగతేంటి?

TGMDC ప్రాజెక్ట్ అధికారి 26-05-2026న గ్రామపంచాయతీ కార్యదర్శికి పంపిన లేఖలో తీర్మానం పంపించాలని కోరడం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఆ తీర్మానం నిజంగా జరిగిందా? జరిగితే ఏ తేదీన జరిగింది? తీర్మానంలో ఎలాంటి షరతులు విధించారు? అనంతరం TGMDCకి తుది అనుమతులు జారీ అయ్యాయా? సొసైటీకి అధికారికంగా పని అప్పగించారా? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉంది. అదేవిధంగా పూడికతీతకు సంబంధించిన మైనింగ్ అనుమతులు, పర్యావరణ అనుమతులు, రవాణా అనుమతులు, స్టాక్ యార్డుల అనుమతులు, పరిమాణాల కొలతలకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### అధికారుల తనిఖీలు ఎక్కడ?

భారీ మొత్తంలో ఇసుక పూడికతీత ప్రతిపాదన ఉన్నప్పుడు సంబంధిత శాఖల పర్యవేక్షణ అత్యంత కీలకం. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జిల్లా సహకార శాఖలు, TGMDC అధికారులు సమన్వయంతో వ్యవహారాన్ని పర్యవేక్షించాలి. అనుమతించిన ప్రాంతంలోనే పూడికతీత జరుగుతోందా? ఎంత ఇసుక తవ్వారు? ఎంత రవాణా చేశారు? ఎక్కడ నిల్వ చేశారు? సొసైటీకి ఎంత ఆదాయం వచ్చింది? గిరిజన సభ్యులకు ఎంత లాభం పంపిణీ చేశారు? అనే వివరాలను ప్రజల ముందుంచాలి.

### విచారణ జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి!

సింగిరెడ్డిపల్లి పూడికతీత ప్రతిపాదన, భూపతిరావుపేటలో ఇసుక నిల్వలపై వస్తున్న ఆరోపణలు, జానంపేట మార్గంలో రవాణాపై వ్యక్తమవుతున్న అనుమానాలన్నింటిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పూడికతీత అనుమతులు, గ్రామపంచాయతీ తీర్మానాలు, సొసైటీ ఒప్పందాలు, ఇసుక రవాణా పర్మిట్లు, స్టాక్ రిజిస్టర్లు, లాభాల పంపిణీ వివరాలను సమగ్రంగా పరిశీలిస్తేనే ఈ వ్యవహారంలో వాస్తవాలు బయటపడతాయి. గిరిజనుల అభివృద్ధి పేరుతో చేపడుతున్న ఇసుక పూడికతీతలో నిజమైన లబ్ధిదారులు గిరిజనులేనా? లేకవారి పేర్లు తెరపై ఉండగా వ్యాపార ప్రయోజనాలు మరెవరికైనా చేరుతున్నాయా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)



వేగవంతం చేయాలని సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాల య లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో జనవరి 1వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు మొత్తం 432 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 193 ప్రాణాంతక ప్రమాదాలు కాగా, 239 ప్రాణాపాయం లేని ప్రమాదాలుగా నమోదయ్యాయనీ, ఈ ప్రమాదాల్లో 206 మంది ప్రాణాలు కోల్పోగా, 28 మంది తీవ్రంగా, 397 మంది స్వల్పంగా గాయపడ్డారనీ, నమోదైన మొత్తం 1055 ప్రమాదాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన డీఆర్వో, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఆర్వో సూచించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు తదితర వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఆర్వో అన్నారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### ప్రైమ్ మినిస్టర్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్

(పీ.ఎం రాత్) పథకంలో భాగంగా డీ.ఆర్.ఎం బాలాజీ వివరాలను వెల్లడించారు. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఎంపిక చేసిన ఆసుపత్రిలో రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరిగిన ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి __ డిఆర్ఓ

కొత్తగూడెం జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారిణి (డీ. ఆర్.ఓ) పద్మావతి బుధవారం జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీతో ఐడిఓస్ లోని కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జిల్లాలో ఇప్పటివరకు భద్రాద్రి జిల్లాలో మొత్తం 89కేసులు నమోదు అవగా 2200.89 కేజీల గంజాయి సీజ్ విలువ రు. 11,25,94,500 మొత్తం 274 మందిని అరెస్టు చేసినట్లు డీ.ఆర్.ఓ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 109 మందిని డీ – అడిక్షన్ సెంటర్ కు తరలించినట్లు వివరాలు వెల్లడించారు. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలుదుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అత్యంత అవసరమన్నారు.

జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సీ.హెచ్ వెంకటేశ్వర్లు, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీ. ఏం.హెచ్.ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా వైద్య శాఖ అధికారులు డాక్టర్ వీరబాబు, ఆరోగ్యశ్రీ ప్రతినిధి మహేష్, పోలీస్ అధికారులు కరుణాకర్, విజయలక్ష్మి ,రవాణాశాఖ ఎ.ఏం.వీ.ఐ శ్వేతా, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ ప్రతినిధి మోహన్ రావు, ఆర్అండ్‌బీ, ట్రాఫిక్, ఎక్సైజ్, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమాల ఉరుము.. బహుజన గళం.. సిద్దెల హుస్సేన్!

- పాటే ఆయుధం.. ప్రజా చైతన్యమే లక్ష్యం!
- తెలంగాణ ఉద్యమంలో ఉరికిన గళం.. బహుజన బతుకుల్లో వెలుగులు నింపిన ప్రజా కళాకారుడు సిద్దెల హుస్సేన్
- అవార్డులు ఎన్నో.. సత్కారాలు మరెన్నో.. అయినా ప్రజల కోసమే ఆయన పాట ప్రయాణం!
- 29 రోజుల జైలు జీవితం.. ఉద్యమాల్లో కేసులు.. కార్మికుల హక్కుల కోసం పోరాటాలు..
- అంబేద్కర్ నుంచి చాకలి ఐలమ్మ వరకు మహనీయుల ఆశయాలను ఆటపాటలతో ప్రజల్లోకి తీసుకెళ్తున్న కళాకారుడు!









**పినపాక,నవంబర్ 18(ప్రజాజ్యోతి):** పాటను కేవలం వినోద సాధనంగా కాకుండా సమాజ మార్పుకు ఒక శక్తివంతమైన ఆయుధంగా మలుచుకున్న ప్రజా కళాకారుడు సిద్దెల హుస్సేన్. ప్రజల కష్టాలు, కార్మికుల కన్నీళ్లు, బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక అసమానతలు, తెలంగాణ అస్తిత్వ పోరాటం.. ఇలా ఎన్నో అంశాలను తన గళం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన ఆయన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. గద్దర్, గోరేటి వెంకన్న, జయరాజు, పాటమ్మ బిక్షపతి వంటి ప్రజా కళాకారుల స్ఫూర్తితో సాగిన ఆయన కళా ప్రయాణం తెలంగాణ ఉద్యమ చరిత్రతో ముడిపడి ఉంది. గాయకుడి గా, రచయితగా, నటుడిగా, సామాజిక చైతన్యకారుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

### ›» తెలంగాణ ఉద్యమంలో ఉరికిన ప్రజా గళం!

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సిద్దెల హుస్సేన్ తన ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె వంటి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ తెలంగాణ ఆకాంక్షను తన పాటల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఉద్యమ సమయంలో బెయిలబుల్, నాన్ బెయిలబుల్ కేసులు, కోర్టు వ్యవహారాలు, 29 రోజుల జైలు జీవితం వంటి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు ఆయన వెల్లడించారు. అయినప్పటికీ ఉద్యమ మార్గాన్ని వీడకుండా ప్రజల గొంతుకగా నిలిచారు. తెలంగాణ ధూంధాంలలో పాల్గొనడంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటు, అమరవీరుల స్తూపాల స్థాపనలోనూ ప్రత్యేక పాత్ర పోషించారు. ఆంధ్ర పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లోనూ తన గళాన్ని వినిపించారు.

### ›» బహుజన ఆత్మగౌరవానికి పాటలే వేదిక!

బహుజన నాయకుల ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వ భావనలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఆయన సాగించిన కృషి విశేషం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కొమరం భీమ్, జగ్జీవన్ రామ్, సావిత్రిబాయి ఫూలే, చాకలి ఐలమ్మ తదితర మహనీయులు, అమర వీరుల విగ్రహాల ఏర్పాటులో విశేష కృషి చేసినట్లు ఆయన తెలిపారు. వారి జీవిత చరిత్రలు, పోరాట స్ఫూర్తిని పాటలు, ఆటల రూపంలో ప్రజలకు చేరువ చేశారు. బహుజనుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. మణుగూరులో తెలంగాణ చౌరస్తా ఏర్పాటులోనూ ముఖ్య భూమిక పోషించారు.

### ›» కార్మికుల పక్షాన అలుపెరుగని పోరాటం!

కళాకారుడిగానే కాకుండా కార్మిక నాయకుడిగా కూడా సిద్దెల హుస్సేన్ తనదైన ముద్ర వేశారు. కాంట్రాక్ట్ లేబర్ గా పనిచేసిన అనుభవంతో కార్మికుల సమస్యలను దగ్గరగా తెలుసుకున్నారు. ఉద్యోగ సంఘాల నాయకుడిగా కార్మికుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అనేక పోరాటాలు చేశారు. ఈ క్రమంలో స స్పెన్షన్లు వంటి ఉద్యోగపరమైన ఇబ్బందులను సైతం ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు పొందడంతో పాటు 'సింగర్ ఆఫ్ టీఎస్‌జెన్ కో'గా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఉద్యోగ బాధ్యతలు ఒకవైపు, ప్రజా ఉద్యమాలు మరోవైపు సాగిస్తూ తన కళను ప్రజల కోసం అంకితం చేశారు.

### ›» అవార్డులు ఎన్నో.. కళా ప్రతిభకు గుర్తింపెన్నో!


తన కళా ప్రస్థానంలో సిద్దెల హుస్సేన్ అనేక పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నంది అవార్డు, కళారత్న, సే వారత్న, ట్రూ ఇండియన్ అవార్డు, జానపద గాన సామ్రాట్, వందే భారత్ అ వార్డు, ఇండియన్ గ్లోరీ అవార్డు వం టి పుర స్కారాలు అందుకున్నారు. ఈ గు ర్తింపులు ఆయన కళా ప్రతిభకు, ప్రజా చైతన్యం కోసం చేసిన కృషికి ల భించిన గౌరవాలుగా నిలుస్తున్నాయి. అవార్డులు ఎన్ని వచ్చినా ప్రజల మధ్యకు వెళ్లి పాట పాడటమే తనకు నిజమైన సంతృప్తి అని ఆయన భావిస్తున్నారు.

### ›» వెండితెరపైనా తనదైన ముద్ర!

పాటలతో ప్రజలను చైతన్యవంతం చేయడమే కాకుండా నటుడిగా కూడా సిద్దెల హుస్సేన్ తన ప్రతిభను చాటుకున్నారు. దండకారణ్యం, చీకటి సూర్యులు, శ్లోకం, అధినేత, ఓరి దేవుడా, కా లం మారేరా, రాజ్యాధికారం తదితర చిత్రాల్లో నటించారు. తెలంగాణ ప్రజా కళాకారుడిగా, రచయితగా, గాయకుడిగా, జానపద గాన కోయిలగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. బహుజన గీతాల ద్వారా సామాజిక సమస్యలను, ప్రజల జీవన స్థితిగతులను తన రచనల్లో ప్రతిబింబించారు.

### ›» దేశ సరిహద్దులు దాటి వినిపించిన ప్రజా గళం!

సామాజిక చైతన్య కార్యక్రమాలకే పరిమితం కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా తన కళా ప్రతిభను ప్రదర్శించారు. శ్రీలంక, మలేషియా, గోవా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని తన గానంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వివిధ దేశాలకు చెందిన ప్రజల ముందూ తన పాటల ద్వారా సామాజిక సందేశాలను వినిపించారు. ప్రాంతం, భాష, దేశం అనే హద్దులు దాటి కళకు ఉన్న శక్తిని చాటిచెప్పారు. ఎన్నోసవాళ్లు ఎదురైనా తనకళా ప్రయాణాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నారు.



### ›» యూట్యూబ్ వేదికగా నిత్యం ప్రజా చైతన్యం!

కాలం మారుతున్నా తన లక్ష్యాన్ని మార్చుకోకుండా ఎస్ఎస్వీ (SSV) యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సామాజిక అంశాలతో పాటు ఆధ్యాత్మిక, భక్తి గీతాల ద్వారా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నారు. భక్తి పాటలతో ఆధ్యాత్మికతను, సామాజిక పాటలతో చైతన్యాన్ని ప్రజలకు అందించాలన్నదే ఆయన సంకల్పం. కళను ప్రజలకు చేరువ చేయడానికి అందుబాటులో ఉన్న ప్రతి వేదికను వినియోగించుకుంటున్నారు.

### ›» ప్రకృతి పరిరక్షణ నుంచి సమాజ మార్పు వరకు.. పాటే ఆయన ఊపిరి!

సమాజంలో మార్పు రావాలన్నా, ప్రజల్లో చైతన్యం పెరగాలన్నా పాటకు మించిన శక్తివంతమైన సాధనం లేదని సిద్దెల హుస్సేన్ విశ్వసిస్తారు. విలువలతో కూడిన మెరుగైన జీవితం, ప్రకృతి పరిరక్షణ, కార్మికుల హక్కులు, బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం వంటి అంశాలే తన పాటలకు ప్రధాన ఇతివృత్తాలని చెబుతున్నారు. ఉద్యమాల్లో ఎదురైన కేసులు, జైలు జీవితం, ఉద్యోగపరమైన ఇబ్బందులు, ఎన్నోవ్యక్తిగత సవాళ్లు ఎదురైనా పాటను మాత్రం విడిచిపెట్టలేదు.

### ›» పాట ప్రజల కోసమే ప్రతినిత్యం కొనసాగాలి.. మార్పు కోసమే మన పాట ఉండాలి!

అనే ఆశయంతో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న సిద్దెల హుస్సేన్ ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. అవార్డులు ఆయనకు గుర్తింపునిస్తే, ప్రజల మధ్య ఆయన పాడే పాటలు ఆయనకు అసలైన గౌరవాన్ని అందిస్తున్నాయి. కళను వ్యక్తిగత కీర్తి కోసం కాకుండా సమాజ హితం కోసం వినియోగిస్తూ ప్రజల గొంతుకగా నిలవాలన్నదే ఆయన లక్ష్యం. పాటకు ప్రాణం పోస్తూ ప్రజల్లో చైతన్య జ్యోతిని వెలిగించాలనే సంకల్పంతో ఆయన గళం నిరంతరం వినిపిస్తూనే ఉంది.

# కొత్త గూడెం జిల్లా స్థాయి క్విజ్- వ్యాసరచన పోటీల నిర్వహణ

**కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 18,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సీఏ సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్_ ఈ ఎల్ సి ఆధ్వర్యంలో బుధ వారం, ఐ డి ఓ సి నందు నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ , _వ్యాసరచన పోటీలకు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) డి వేణు గోపాల్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువ అయినది అని ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కు ప్రాదాన్యతను తెలుసుకొని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిస్పక్షపాతంగా, పారదర్శకంగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలి అని తెలిపినారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు–ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, ఎన్నికల విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు,




. ఈ ఎల్ సి ద్వార విద్యార్థులు – ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు, స్వేచ్ఛాయుత, నిస్పక్షపాత ఎన్నికల ప్రాదాన్యత వంటి అంశాల పై నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు ,జిల్లా స్థాయి క్విజ్ _ వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చి విజేతలుగా నిల్చిన విద్యార్థులకు ప్రసంశ పత్రాలు, బహుమతులను అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీ డి వేణు గోపాల్ అందజేశారు, ఈ కార్యక్రమం లో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రంగ ప్రసాద్, జిల్లా ఈ ఎల్ సి కోఆర్డినేటర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ కుమార్, అశోక్ కుమార్ లు పాల్గొనగా ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు ప్రభావతి, తారాచంద్, విజయ నిర్మల, కామేశ్వరి, వివేక పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఐదు నియోజక వర్గాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు వారి గైడు ఉపాధ్యాయులు మొత్తం సుమారు 130 మంది పాల్గొన్నారు



# తెల్లం శరత్ హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సత్యసాయి లాడ్జి సిబ్బందిని కఠినంగా శిక్షించాలి



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):** ఆదివాసీ విద్యార్థి తెల్లం శరత్ హత్యకు కారణమైన సత్యసాయి లాడ్జి సిబ్బంది, దుండగులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు వాగ బోయిన చంద్రయ్య దొర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పరిషత్ రాష్ట్ర నాయకుడు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శరత్ హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, అనుమతులు లేకుండా నిర్మించిన సత్యసాయి లాడ్జిని వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో ఆదివాసీలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో వలస వచ్చిన పలువురు అక్రమ భవనాలు, లాడ్జీలు, హోటళ్లు నిర్మిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఏజెన్సీ చట్టాలు గిరిజనేతరుల అక్రమ నిర్మాణాల విషయంలో అమలుకాకుండా, ఆదివాసీలకే అడ్డంకిగా మారుతున్నాయని పేర్కొన్నారు.

# మానవ సేవే - మాధవ సేవ

- చలిలో నిరాశ్రయులకు సేవా ధర్మం భరోసా
- సేవా ధర్మం వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో "దుప్పట్ల పంపిణీ"



**భద్రాచలం, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):** చలికాలంలో రాత్రివేళ రోడ్ల పక్కన, ఆలయాల పరిసరాల్లో ఆశ్రయం లేకుండా నిద్రిస్తున్న నిరుపేదలు, నిరాశ్రయులకు అండగా నిలిచేందుకు సేవా ధర్మం వాట్సాప్ గ్రూప్ సభ్యులు ముందుకొచ్చారు. మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో మంగళవారం రాత్రి దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాచలంలోని రామాలయం పరిసర ప్రాంతాలు, నిత్యకళ్యాణ మండపం, కరకట్ట ప్రాంతాల్లో చలికి వణుకుతూ నిద్రిస్తున్న నిరాశ్రయులను గుర్తించి దుప్పట్లు అందజేశారు. చలికాలంలో కనీస రక్షణ లేక ఇబ్బందులు పడుతున్న వారికి తమవంతు సహాయం అందించాలనే మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.సమాజంలో సేవాభావం, మానవత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుంజా సంతోష్, వరద సతీశ్, సతీష్ రెడ్డి, సాయి కౌశిక్, పుల్లయ్య మేస్త్రి, సవలం వంశీ, మోహన్, సాయి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# పర్ణశాల హుండీ ఆదాయం రూ.20.22 లక్షలు



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజా జ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.20,22,606 ఆదాయం సమకూరింది. భక్తులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ మొత్తం వచ్చినట్లు దేవస్థాన వర్గాలు వెల్లడించాయి.గతంలో హుండీ లెక్కింపు 2026ఫిబ్రవరి 18వ తేదీన నిర్వహించారు. సుమారు తొమ్మిది నెలల అనంతరం జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.20లక్షలకు పైగా ఆదాయం రావడంతో దేవస్థానానికి భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని స్పష్టమవుతోంది.

# పట్టభద్రుల ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటించాలి

- భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్
- ఓటరు జాబితా డి-నోవో ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 18,(ప్రజా జ్యోతి)** పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గాల ఓటరు జాబితా డి-నోవో (కొత్తగా) రూపకల్పన ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ ఎన్నికల అధికారులకు సూచించారు.పట్టభద్రుల ఓటరు జాబితా డి-నోవో రూపకల్పనలో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి సుమన్ కుమార్ దాస్ మాట్లాడుతూ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించిచేపట్టిన డి-నోవో ఓటరు జాబితా రూపకల్పనలో పూర్తి పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని, అర్హత లేని వ్యక్తులకు ఓటరు జాబితాలో చోటు కల్పించరాదని స్పష్టం చేశారు. ప్రస్తుత ఓటరు జాబితా తయారీ పూర్తిగా కొత్తగా చేపడుతున్న ప్రక్రియ అని, గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం అవి ఆటోమేటిక్‌గా కొనసాగవని తెలిపారు.పట్టభద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి విద్యార్హతలను సంబంధిత ధ్రువీకరణ పత్రాల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని, తగిన విద్యార్హతలు లేని వ్యక్తులను జాబితాలో చేర్చరాదని ఆదేశించారు. ఒకే వ్యక్తి పేరు వేర్వేరు ప్రాంతాల్లో నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సరైన ఆధారాలతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఓటరు నమోదు ప్రక్రియకు వినియోగించే సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ వ్యవస్థలను ముందుగానే పూర్తిస్థాయిలో పరీక్షించాలని, సాంకేతిక సమస్యలు, అనువాదలోపాలు, దరఖాస్తు కేంద్రాల్లో ఎదురయ్యే ఇబ్బందులను వెంటనే గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. సరైన పరీక్షలు, ధ్రువీకరణ లేకుండా కొత్త సాఫ్ట్‌వేర్ లేదా ఫీచర్లను అమలు చేయరాదని స్పష్టం చేశారు.ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి దశలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి అభ్యంతరాలు, సూచనలను నమోదు చేయాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశాల వివరాలు, తీసుకున్న నిర్ణయాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు . అనంతరం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదుకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 57,376 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో 52,044 దరఖాస్తులను ఆమోదించగా, నిర్దిష్ట కారణాలతో 4,113 దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు.మిగిలిన 1,219 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని,వాటిని ఒకటి రెండు రోజుల్లోగా పరిష్కరిస్తామని వివరించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం నిర్ణీత విధివిధానాల ప్రకారం తదుపరి ప్రక్రియను పూర్తి చేసి, డిసెంబర్ 30వ తేదీన తుది పట్టభద్రుల ఓటరు జాబితాను ప్రకటించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మీసేవ కేంద్రాల పేరుతో ప్రజల జేబులకు గండి!

- ప్రభుత్వ రుసుములకు తిలోదకాలు..
- సామాన్యుల జేబులకు సిల్లులు
- అదనపు వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?
- తక్షణమే తనిఖీలు చేపట్టాలి.. బీఆర్ఎస్ నాయకుడు వెన్న అశోక్ కుమార్ డిమాండ్



**అశ్వాపురం, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలు అశ్వాపురం మండలంలో సామాన్య ప్రజలకు ఆర్థిక భారంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వమే నిర్ణయించిన సేవా రుసుములు ఒకవైపు ఉంటే, కొన్ని మీసేవ కేంద్రాల్లో వసూలు చేస్తున్న మొత్తాలు మరోవైపు ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

›› ప్రభుత్వ ధరలు ఒకటి.. వసూళ్లు మరొకటి!

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ ప్రభుత్వ సేవల కోసం మీసేవ కేంద్రాలను ఆశ్రయించే ప్రజల నుంచి నిర్ణీత రుసుముల కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.అత్యవసరంగా ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన పరిస్థితుల్లో ప్రజలు అదనపు మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేవలు అందించాల్సిన కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

›› అధికారుల పర్యవేక్షణ ఏదీ?

మీసేవ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయించిన ధరల పట్టికలు ఏర్పాటు చేశారా? ప్రతి సేవకు నిర్ణీత రుసుమే వసూలు చేస్తున్నారా? ప్రజలకు రసీదులు అందిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

›› అధికారులు స్పందించాలి.. వెన్న అశోక్ కుమార్

మీసేవ కేంద్రాల్లో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న అదనపు వసూళ్లపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని బీఆర్ఎస్ నాయకుడు వెన్న అశోక్ కుమార్ కోరారు. ప్రభుత్వమే నిర్ణయించిన రుసుముల ప్రకారం ప్రజలకు సేవలు అందించాల్సి ఉండగా, అదనపు వసూళ్లతో సామాన్య ప్రజలపై భారం మోపడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మీసేవ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధిక వసూళ్లకు పాల్పడుతున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రతి కేంద్రంలో ప్రభుత్వ రుసుముల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని, ప్రతి లావాదేవీకి రసీదు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు అదనపు భారంగా మారకుండా అధికారులు ఇప్పటికైనా మేల్కొని మీసేవ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని వెన్న అశోక్ కుమార్ కోరారు.

# రైతుల ధాన్యం కొనుగోలుకు పాల్వంచ సొసైటీ ఆధ్వర్యంలో ఐదు కేంద్రాలు సిద్ధం

- కామన్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441, ఏ గ్రేడ్‌కు రూ.2,461 మద్దతు ధర
- ఎంపిక చేసిన సన్న ధాన్యం రకాలకు క్వింటాకు రూ.500 బోనస్ – సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** రైతుల నుంచి ధాన్యం సేకరణకు పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసినట్లు సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని ప్రభాత్ నగర్ (రెడ్డిగూడెం), కారేగట్టు, సోనులగూడెం, పాల్వంచ పట్టణంలోని పేటచెరువు (గుడిపాడు) ప్రాంతాల్లో మొత్తం ఐదు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం కామన్ రకం (దొడ్డు రకం) ధాన్యానికి క్వింటాకు రూ.2,441, ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,461 చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ ఎంటీ సోనా, జైశ్రీరామ్ సెగ్మెంట్, కేఎన్ఎం 1638, వరంగల్ 44, కేఎన్ఎం 7715 రకాల ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తూ క్వింటాకు రూ.500 బోనస్ అందించనున్నట్లు పేర్కొన్నారు.

### పంట రుణాలను గడువులోగా రెన్యువల్ చేసుకోవాలి

పంట రుణాలు తీసుకున్న రైతులు నిర్ణీత గడువులోగా 7 శాతం వడ్డీ చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని కొత్వాల సూచించారు. ఈ విధంగా చెల్లించిన అర్హులైన రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా 3 శాతం వడ్డీ రాయితీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. గడువు దాటిన రుణ బకాయిలకు 13 శాతం వడ్డీ వర్తిస్తుందని, బకాయిల విషయంలో నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు. రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం సూచిస్తోందన్నారు. రైతులకు అవసరమైన యూరియా, 20-0-13 ఎరువులు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, సామా జనార్దన్ రెడ్డి, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధు, సీఈఓ జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- నవంబర్ 20 నుంచి డిసెంబర్ 18 వరకు నమోదు ప్రక్రియ : ఎంపీడీవో రవీంద్రారెడ్డి



**దమ్మపేట, నవంబర్ 18 ( ప్రజాజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించనున్నట్లు దమ్మపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) రవీంద్రారెడ్డి తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని మరణానికి గురైనప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఆదుకోవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన సంపాదించే సభ్యుల్లో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకోవచ్చని, ఒక కుటుంబంలో ఎంతమంది సంపాదించే సభ్యులు ఉన్నప్పటికీ ఒక్కరికి మాత్రమే బీమా సౌకర్యం ఉంటుందని వివరించారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి రూ.5 లక్షల పరిహారం అందజేస్తారని, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. రేషన్ కార్డు వివరాల ఆధారంగా కుటుంబాలను గుర్తించి నమోదు చేయడంతో పాటు, రేషన్ కార్డులు లేని కుటుంబాలకు కూడా ప్రత్యేక దరఖాస్తు విధానం కల్పించినట్లు వెల్లడించారు.

### నవంబర్ 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీవో తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన కుటుంబాల వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. దమ్మపేట మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కుటుంబంలో బీమాకు అర్హులైన సంపాదించే సభ్యుడిని ఎంపిక చేసుకొని నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న రూ.5 లక్షల జీవిత బీమా భరోసాను అర్హులైన కుటుంబాలన్నీ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రవీంద్రారెడ్డి కోరారు.

# అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

- ఉద్యోగుల సమస్యల పరిష్కారమే జేఏసీ ప్రధాన లక్ష్యం జిల్లా అధ్యక్షుడు సగ్గుర్తి దిలీప్



**పాల్వంచ, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్ణయించింది. ఈ మేరకు నవంబర్ 18, 2026న జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సమావేశం జిల్లా అధ్యక్షుడు సగ్గుర్తి దిలీప్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య సమక్షంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అవుటసోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలు, హక్కులు, భవిష్యత్తు కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

### సమావేశంలో పలు కీలక తీర్మానాలు

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

### డిసెంబర్ 1న జిల్లా స్థాయి సమావేశం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సమన్వయం చేస్తూ డిసెంబర్ 1, 2026న విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, తదుపరి ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం: వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఇతర ఉద్యోగ సంబంధిత సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు.

### జేఏసీ బలోపేతం

అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి జిల్లా, మండల స్థాయిలో జేఏసీ కమిటీలను బలోపేతం చేయాలని నిర్ణయించారు.

### ఐక్య పోరాటానికి పిలుపు

ఉద్యోగుల హక్కుల సాధన కోసం వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని, సమిష్టి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సగ్గుర్తి దిలీప్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘటితంగా ఉండాలని, వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమమే మార్గమని, ప్రతి ఉద్యోగి సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణం

- జిల్లా పంచాయతీ అధికారి అనూష



**చంద్రుగొండ నవబర్ 18 ( ప్రజా జ్యోతి ):** ఎల్‌నినో ప్రభావం నుండి కాపాడుకోవడం కోసం, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడుగుంతలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పంచాయతీ అధికారి అనూష అన్నారు. బుధవారం మద్దుకూరు గ్రామంలో ఇంటింటికి ఇంకుడుగుంతల నిర్మాణం పనులకు ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 21844 ఇంకుడుగుంతల నిర్మాణమే లక్ష్యమని, ఇప్పటి వరకు వెయ్యి వరకు ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తి అయినాయన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత ఉండేలా గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి బాధ్యత తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారం అందిస్తే అనుకున్న టార్గెట్ను త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట మండల అధికారులు ఎంపీడీవో అశోక్, ఏపిఓ శ్రీనివాస్, ఎంపీఓ ఎండి ఖాన్, సర్పంచ్ కొడెం క్రిష్ణవేణి, ఉపసర్పంచ్ బడికల శ్రావణ్ కుమార్, గుంపెన సోసైటి వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి, వార్డు మెంబర్లు కుంజ అశ్విని, శకుర్తి శారద, కుంజా రాము, గ్రామ పెద్దలు కొడెం రాంబాబు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా చంద్ర నరసింహారావు ఎంపిక

- రెండోసారి అవకాశం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు దక్కిన గుర్తింపు
- నరసింహారావుకు జర్నలిస్టు సంఘాల నాయకులు, పలువురి అభినందనలు



**పాల్వంచ, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** ఇంటర్నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పాల్వంచకు చెందిన సీనియర్ జర్నలిస్టు చంద్ర నరసింహారావు రెండోసారి ఎంపికయ్యారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే – హెచ్-142) అనుబంధంగా ఉన్న ఐజేయు జాతీయ కౌన్సిల్‌కు తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాల నుంచి మొత్తం 80 మంది సభ్యులను ఎంపిక చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి చంద్ర నరసింహారావుకు మరోసారి అవకాశం దక్కింది. ఆయనతో పాటు ఇల్లందుకు చెందిన గుర్రం రాజేష్‌కూడా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎంపికయ్యారు. టీయూడబ్ల్యూజే ఆవిర్భావం నుంచి సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న చంద్ర నరసింహారావుకు రెండోసారి ఈ అవకాశం లభించడం పట్ల జర్నలిస్టు వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, సహచరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తన ఎంపికకు సహకరించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, జాతీయ నాయకులు ఏ. భాస్కర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా బాధ్యులు ఆకుతోట ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్‌లకు చంద్ర నరసింహారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


TELANGANA UNION OF WORKING JOURNALISTS
TELANGANA UNION OF WORKING JOURNALISTS (TUWJ)
ELECTED IJU NATIONAL COUNCIL MEMBERS
DISTRICT QUOTA
SHRI GORLA BUCCHANNA

# పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా మహా పడిపూజ

► అయ్యప్ప స్వామిని దర్శించుకున్న దేవాలయ కమిటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, నవంబర్ 18, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ అయ్యప్ప దేవాలయంగా పేరొందిన పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. గురుస్వాములు బేతంశెట్టి వెంకట్, బేతంశెట్టి విజయ్ మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన పూజారులు మాధవన్ నంబూద్రి, బృందావనం నరసింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు, వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు విశేష సేవలందిస్తున్న పూజారులు, గురుస్వాములను కొత్వాల శ్రీనివాసరావుతో పాటు ట్రస్ట్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు కాల్వ భాస్కర్ రావు, మేడిద సంతోష్ గౌడ్, కనగాల రాంబాబు, బి. శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఏ. శంకర్ మణి, ముల్లెల నాగేంద్రం, పిలకా రమేష్, నరహరి, భట్టు మంజుల, పావని తదితరులు పాల్గొన్నారు.

# కమలాపురం ఆశ్రమ పాఠశాలలో సిఐ ఆకస్మిక తనిఖీ



**ములకలపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** మండలంలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలను పాల్వంచ సీఐ సతీష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల సంరక్షణ, భద్రత కోసం చేపట్టిన చర్యలను పరిశీలించారు. హాస్టల్ భద్రతా ఏర్పాట్లతో పాటు ఇతర సౌకర్యాలను తనిఖీ చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్, పాఠశాల హెచ్ఎం బుచ్చిరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

# మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద అక్రమ కలప పట్టివేత

► ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఐదు టన్నుల కలప స్వాధీనం



**దమ్మపేట, నవంబరు 18 (ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నుంచి సత్తుపల్లికి అక్రమంగా తరలిస్తున్న ఐదు టన్నుల కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. దమ్మపేట మండలం మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌లో తరలిస్తున్నసుమారు ఐదు టన్నుల మిక్స్‌డ్ ఫైర్‌వుడ్ కలపను గుర్తించారు. దీని విలువ రూ.24,375 ఉంటుందని అంచనా వేసి, కలపతో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అటవీ సంపద అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

# ఇల్లందు భవిష్యత్తును కాపాడుతాం...

- రాష్ట్ర ప్రభుత్వం, ఐఎన్టీయూసీ యూనియన్ నిరంతరం కృషి
- కార్మికుల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం




**ఇల్లందు, నవంబర్ 18 (ప్రజా జ్యోతి)** ఇల్లందు ఏరియా భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఐఎన్టీయూసీ యూనియన్ నిరంతరం కృషి చేస్తున్నాయని ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ పేర్కొన్నారు. బుధవారం ఇల్లందు ఏరియాలోని పలు విభాగాల్లో ఏర్పాటు చేసిన గెట్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థతో పాటు ఇల్లందు ప్రాంత అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ఐఎన్టీయూసీ, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇల్లందు ప్రాంతానికి సింగరేణి ఎంతో కీలకమని, ఈ ప్రాంత అభివృద్ధి, భవిష్యత్తు తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇల్లందు ప్రాంత ప్రయోజనాలకు విఘాతం కలగకుండా, అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం, కార్మిక సంఘాలు సమన్వయంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇల్లందు ఏరియా భవిష్యత్తు పెరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఐఎన్టీయూసీ యూనియన్ ఎంతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండి సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో ఐఎన్టీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇల్లందు ప్రాంతంలో ఉపాధి అవకాశాలు, సింగరేణి కార్యకలాపాలు, స్థానిక అభివృద్ధి అంశాలకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని, ఇల్లందు భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం, ఐఎన్టీయూసీ యూనియన్ నిరంతరం కృషి చేస్తాయని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ లోనే ఇల్లందు ఏరియాలో పూసపల్లి ఓసి ప్రాజెక్టు ప్రారంభించడం జరుగుతుందని, దానికోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టియుసి కృషి ఎంతో ఉందన్నారు. ఇతర కార్మిక సంఘాలు తమ వల్లే ఇల్లందు ఏరియాకు పూసపల్లి ఓసి త్వరితగతిన ప్రారంభించడం జరుగుతుందని, ఇతర కార్మిక సంఘాలు తామే చేశామని ప్రగల్భాలు పలకడం సరికాదని, నల్ల బ్యాడ్జీలు ధరిస్తే ఏరియా భవిష్యత్తు కోసం పోరాడినట్లు కాదని హితవు పలికారు. ఇల్లందు ఏరియా కనుమరుగు కావాలని కొన్ని కార్మిక సంఘాలు కుట్రలు పన్నుతున్నాయని, వాటిని ప్రతిఘటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఐఎన్టియుసి ఎంతో కృషి చేస్తుందని, ఆ విషయం కార్మిక లోకానికి తెలుసునని గుర్తు చేశారు.

అదేవిధంగా కార్మికుల సొంత ఇంటి కల త్వరలోనే నెరవేరుతుందని, ఎన్సిడబ్ల్యూ కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు, మారు పేర్ల మార్పిడం, కొత్త గనులు తీయడం సాధ్యం కావాలంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్టీయూసీతోను సాధ్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షుడు జే వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా జనరల్ సెక్రెటరీ అల్బర్ట్, సెంట్రల్ జనరల్ సెక్రెటరీ గోచికొండ సత్యనారాయణ, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పీతాంబరావు, వర్క్ షాప్ ఫిట్ సెక్రెటరీ మధు కుమార్, బ్రాంచ్ సెక్రెటరీ జమీల్, బాబురావు, నాయకులు యాదగిరి, రఘు, మొయిన్ బాషా, మహబూబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- పట్టణంలో విద్యుత్ లైన్ మరమ్మతులు
- నాలుగు గంటల పాటు సరఫరా నిలిపివేత



**భద్రాచలం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం (నవంబర్ 19) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఎన్పీడీసీఎల్ డీఈ జీవన్ కుమార్ తెలిపారు. బొల్లా కాంప్లెక్స్, బాలదుర్గ బట్టల దుకాణం, డాక్టర్ దేవరాజు ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. మరమ్మతు పనులు సజావుగా నిర్వహించేందుకు ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పాములేరు వాగుపై వంతెన నిర్మించాలి

- డైవర్షన్ పనులపై విచారణ జరిపించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి డిమాండ్



**ములకలపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** రాజుపేట వద్ద పాములేరు వాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి కూలిపోయిన బ్రిడ్జి, దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.50 లక్షలతో నిర్మించిన డైవర్షన్ రోడ్డు 10–15 రోజుల్లోనే దెబ్బతినడం అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజాధనాన్ని వృథా చేశారని విమర్శించారు. డైవర్షన్ పనుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు గూగులోత్ శంకర్ నాయక్, జాతీయ ఎస్టీ నాయకులు ననావత్ బిక్కునాథ్ నాయక్, జిల్లా నాయకులు గొట్టిపల్లి శ్రీనివాస్, తంబళ్ల రవి, ఊకంటి మధుసూదన్ రావు, అనుమల శ్రీనివాస్, చీకటి ప్రకాష్, గొడ్ల రాజయ్య, మండల ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్ కుమార్, అత్యం సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి కృష్ణయ్య, డాక్టర్ జటోత్ వెంకన్ననాయక్, మండల నాయకులు భానోత్ మల్లేష్, ఎర్రం సెట్టి శ్రీనివాస్, అచ్చన రంగారావు, పాలకుర్తి ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, సాయల శ్రీను మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకలు

- బీజేపీలో చేరిన 40 కుటుంబాలు



**ములకలపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి):** భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ములకలపల్లిలో జనజాతీయ గౌరవ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు ననావత్ బిక్కునాథ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు, గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ కోసం బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, బిర్సా ముండా గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఆయన త్యాగాలను భావితరాలకు తెలియజేయాలన్నారు. అనంతరం మాదారం గ్రామపంచాయతీ పరిధికి చెందిన సీపీఎం నుంచి 15, కాంగ్రెస్ నుంచి 25 కుటుంబాలు మొత్తం 40 కుటుంబాలు బీజేపీలో చేరాయి. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఊకంటి మధుసూదన్ రావు ఆధ్వర్యంలో చేరిన వారికి బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల బీజేపీ అధ్యక్షులు గూగులోత్ శంకర్ నాయక్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు భూక్య స్వాతి, జిల్లా నాయకులు గొట్టిపల్లి శ్రీనివాస్, తంబళ్ల రవి, ఊకంటి మధుసూదన్ రావు, అనుమల శ్రీనివాస్, చీకటి ప్రకాష్, గొడ్ల రాజయ్య, పూనెం నవీన్ కుమార్, అత్యం సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి భోగి కృష్ణయ్య, డాక్టర్ జటోత్ వెంకన్న నాయక్, మండల నాయకులు భానోత్ మల్లేష్, యర్రంశెట్టి శ్రీనివాస్, అచ్చన రంగారావు, పాలకుర్తి ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు, సాయిల శ్రీను మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.